క్లుప్తంగా

పంచాయతీ పరిపాలన విధానాలపై అవగాహన

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ పరిపాలన విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ విలియమ్స్ మాట్లాడుతూ పంచాయతీకి ఆదాయ వనరులు ఏవిధంగా సమకూర్చుకోవాలి దాన్ని మళ్లీ పంచాయతీ అభివృద్ధికి ఎలా వినియోగించాలనే దానిపై వివరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు జీవీఆర్‌కే మూర్తి, సత్యానంద్‌లు సారుప్య స్వభావాలు, పంచాయతీల సమావేశాల నిర్వహణ, పన్నులు, ఆర్థిక పథకాలు, రికార్డులు, సొంతాదాయ వనరులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, ఫిరంగిపురం సచివాలయం 2,3 పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ విలియమ్స్ మంగళవారం తెలిపారు. ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ నియామక పత్రాలు అందజేశారన్నారు.

జీజీహెచ్ శానిటేషన్ సంస్థకు నోటీసులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో శానిటేషన్ కాంట్రాక్టు నిర్వహణ బాధ్యత చేపట్టిన ఏజైల్ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. క్యాజువాల్టిలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 240 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉండాల్సి ఉండగా, కేవలం 170 మంది మాత్రమే పని చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులకు క్లీనింగ్‌కు ఆధునిక పరికరాలు ఇవ్వకుండా పురాతన పద్ధతుల్లో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, తూతూ మంత్రంగా వారు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో శానిటేషన్ కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో డెప్యూటీ డీఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లక్ష్మీపురం: గుంటూరు శ్యామలానగర్ గేటు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలా నగర్ రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (45) రైలు పట్టాలపై పడి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని విచారించడం జరిగిందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా విచారణలో తెలడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆర్పీఎఫ్ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

డ్రెయిన్లలో పూడిక తీయించాలి

నెహ్రూనగర్: నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఇంజినీరింగ్ అధికారులను కోరారు. మంగళవారం కమిటీ సభ్యులు మెడికల్ క్లబ్, చుట్టుగుంట, లాల్ పురం రోడ్ కల్వర్ట్, ఏటుకూరు రోడ్, కమ్మ శేషయ్య గ్రౌండ్, సత్యసాయి స్కూల్, జాతీయ రహదారి కల్వర్టర్లు, పొన్నూరు రోడ్, శారదా కోల్డ్ స్టోరేజ్ వెనుక, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, కాకాని రోడ్ ఉదయ్ హాస్పిటల్, ఓల్డ్ క్లబ్ రోడ్, వేళాంగిణి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టడం వలన ప్రస్తుత తుఫాన్ వలన ఎక్కువ ప్రాంతాలు ముంపునకు గురి కాలేదని అభిప్రాయపడ్డారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్.ఏ.సి.)సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అన్ని విధాలుగా అండగా రాష్ట్ర ప్రభుత్వం

పొన్నూరు: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంగళవారం వర్షాల కారణంగా నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై ఆయన అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని కోరారు. తేమ వున్న ధాన్యమైనా రంగుమారిన ధాన్యమైనా యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడాల్సిన అవసరం ఉండదని వెల్లడించారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు లేకుండా యంత్రాలతో తొలగించాలన్నారు.

తుఫాన్ ప్రభావం.. పంటలకు తీవ్రనష్టం

- మంగళగిరి మండల పరిధిలో 625 ఎకరాలలో వరి, 350 ఎకరాల్లో మినుము, 50 ఎకరాల్లో అరటికి నష్టం
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే ఆర్కే


తాడికొండలో వర్షానికి నేలవాలిన వరి పంట


గుండిమెడ-చిర్రావూరు రోడ్డులో రోడ్డుమీద పోసి పట్టాలు కప్పిన ధాన్యం

మంగళగిరి: మిచాన్ తుఫాన్ ప్రభావం నగర పరిధిలోని పంటలకు తీవ్ర నష్టం చేసింది. గత రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో నగర ప్రజలు రోజువారీ జీవనంపై ప్రభావం చూపింది. మంగళగిరి మండల పరిధిలోని పెదవడ్లపూడి, నూతక్కి, రామచంద్రాపురం, కాజ, చినకాకానిలతో పలు గ్రామాల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు 625 ఎకరాల కోతకు వచ్చిన వరిపంట దెబ్బతినగా 350 ఎకరాల మినుము, 50 ఎకరాల అరటి పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు నగరంలో చిరువ్యాపారులు, కూలీల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయి.

పంట నష్టంపై ఎమ్మెల్యే ఆర్కే సమీక్ష..

తుఫాన్ ప్రభావంతో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల నష్టంపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎంటీఎంసీ కార్యాలయంలో వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ఎన్ని ఎకరాలు దెబ్బతిన్నది గుర్తించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలన్నారు. పంటనష్టంతో పంటల బీమాలపై వివరాలు సేకరించి రైతులకు బీమా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా దెబ్బతిన్న ప్రతి పంటకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే ఎన్యుమరేషన్ చేసి పంటల నష్టాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి నివేదికలు అందజేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్ రెడ్డి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ఏఓలు లక్ష్మీశైలజ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

కూలిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు

ఫిరంగిపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వరి చేలు ఒరిగి పోయాయి. రేపూడి గ్రామశివారు, వేమవరం డొంకరోడ్డు, శిరంగిపాలెం, మునగపాడు, మేరికపూడి ప్రాంతాల్లో వేసిన వరిచేలు ఒరిగి పోయాయి, మేరికపూడి శివారులోని చేలవద్ద మూడు విద్యుత్ స్తంభాలు పక్కకు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు. అదేవిధంగా వేమవరంలో బీసీ కాలనీలో విద్యుత్‌స్తంభం పడిపోవడంతో దానిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఆ శాఖ ఏఈ పుల్లారెడ్డి తెలిపారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు..

తుఫాన్ ప్రభావంతో మండలంలో తక్షణ సహాయ చర్యలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు 15 మంది మండలస్థాయి వివిధశాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పద్మనాభుడు తెలిపారు. ఆయా కమిటీల సభ్యులు తుఫాన్ ప్రభావంతో ఏర్పడే ఇబ్బందులు తొలగించేందుకు తక్షణ సహాయ చర్యలు చేపడతారని చెప్పారు. ఇప్పటివరకు మండలంలో 61.2 మి.మీ.వర్షపాతం నమోదయినట్లు ఆయన వివరించారు. పాత గృహాల్లో నివసించేవారు తక్షణం మరో ప్రాంతానికి వెళ్లేలా చూడాలని ఆదేశించారు.

అదుపు తప్పిన లారీ...

కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంబడి స్మశాన వాటిక సమీపంలో ఓ లారీ కరకట్ట కిందకు దింపబోయి అదుపు తప్పింది. డ్రైవర్ అప్రమత్తమై లారీ ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కట్ట కింద నుంచి లారీని బయటకు తీయాలంటే భారీ క్రేన్ అవసరమవుతుందని, వర్షం తగ్గితే తప్ప లారీ బయటకు తీయలేమని డ్రైవర్ తెలియజేశారు.


రేపల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి రహదారిపై జారిన లారీ

నేలవాలిన ఆశలు..

తాడికొండ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో తాడికొండ తుళ్లూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగాయి. ప్రధానంగా మిర్చి, జొన్న, మినుము, వరి పంటలకు నష్టం వాటిల్లింది. వర్షాలకు తోడు ఈదురు గాలులు భారీగా వీచటంతో పంట పొలాలు నేలకొరిగాయి. ఏపుగా పెరిగి కాపుదశలో ఉన్న పంటలకు భారీ వర్షాలు తీవ్రమైన నష్టాలు మిగిల్చాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ అల్పపీడనం కొనసాగుతుడటంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పూర్తిగా వర్షం తగ్గుముఖం పడితే గాని ఎంత మేరకు నష్టం వాటిల్లింది అనేది తెలియనుంది.


నూతక్కిలో తడిసిన మినుము పైరు

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు


తాడికొండలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: మిచాంగ్ తుఫాన్ కారణంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాడికొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మంగళవారం పర్యటించారు. తాడికొండలో నీట మునిగిన వరి, మినుము, జొన్న, పుల్ల శనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని అక్కడికి తరలిస్తున్నామన్నామన్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని వైద్యశాలకు తరలించాలని, ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కత్తెర సురేష్ కుమార్ అధికారులను సూచించారు. నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఆయన వెంట సొసైటీ చైర్‌పర్సన్ షేక్ నగీనా, మాజీ చైర్మన్ వంగా పోలా రెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరిపంటపై తీవ్ర ప్రభావం..

తాడేపల్లిరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో జన జీవనం స్తంభించింది. దుగ్గిరాల, తాడేపల్లి మండల, పట్టణ, రూరల్‌లో వరిపంటలు 70శాతం వరకు దెబ్బతిన్నట్లు రైతులు తెలియజేస్తున్నారు. దుగ్గిరాల మండల వ్యాప్తంగా 20వేల ఎకరాలు వరి సాగుచేస్తుండగా అందులో సగం మంది రైతులు ఇప్పటికే వరికోతలు చేపట్టారు. మరి కొన్ని పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో వరి పొలాల్లో వర్షపు నీరు నిలబడడంతో వరికంకులు నేలకు ఒరిగాయి. పడిపోయిన వరికంకులు నీళ్లలో నానడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క కుప్పలు నూర్చిన వారు ధాన్యాన్ని భద్రపరచలేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొందరు రైతులు పంట పొలాల్లోంచి ధాన్యాన్ని బయటకు తీసుకువచ్చి రోడ్డుపై పోసి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పడిపోయిన వరి పంటను నాలుగైదు దుబ్బులు కలిపి నీళ్లలో నానకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ తెలియజేయడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కంద, చేమ పంట వేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేమ, కంద మొక్కలు విరిగిపోయాయని, దుంప ఊరదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ ప్రాంతాల్లో ఆకుకూరలు పండించే రైతులు ఎక్కువమంది ఉన్నారు. కొత్తగా ఆకు కూర మడులు ఏర్పాటు చేసిన వారికి పూర్తిగా నష్టం జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో నివాసాల్లోంచి ప్రజలు బయటకు రాకపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.


ఈమని, దుగ్గిరాల రహదారిలో నీట మునిగిన వరిపైరు

దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి


దేవతి భగవన్నారాయణ కుటుంబ సభ్యులతో సత్రం ప్రారంభింపచేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. నగరంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఎదుట మైదానంలో దాత దేవతి భగవన్నారాయణ కుటుంబం రూ.75లక్షలతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి దాత భగవన్నారాయణ కుటుంబసభ్యులతో ప్రారంభింపజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అన్నదాన సత్రాన్ని నిర్మించిన దేవతి భగవన్నారాయణ అభినందనీయుడన్నారు. గండాలయ స్వామి కొండపైన, లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద భగవన్నారాయణ ముందుకు వచ్చి అన్నదాన సత్రాలు నిర్మించి భక్తులు భోజనం చేయడానికి ఇబ్బందులు లేకుండా కృషి చేయడం శుభపరిణామమన్నారు. అన్నదాన సత్ర నిర్మాణానికి రూ.25లక్షలతో పునాది నిర్మించిన విజయవాడకు చెందిన విజయ్ కుటుంబసభ్యులు అభినందనీయులన్నారు. ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, దాత భగవన్నారాయణ కుటుంబ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయం ప్రారంభం..

నగరంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులో నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.60లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దేవస్థానానికి దాతలు ఇచ్చిన స్థలాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు ఉపయోగించడంతో పాటు దేవస్థానం ఆదాయాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. పక్కనే ఉన్న 3 ఎకరాల 33 సెంట్ల స్థలంలో దాతల సహకారంతో కళ్యాణ మండపాన్ని నిర్మించి ప్రజలకు తక్కువ రుసుములతో ఫంక్షన్‌లు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సిబ్బందిని పారిశుద్ధ్య పనులకు మాత్రమే వినియోగించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధుల సేవలకు పంపితే సహించేది లేదు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: నగరంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని పారిశుద్ధ్య విధులకు మాత్రమే వినియోగించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాలలో పనులు చేసే వారిని వెంటనే వెనక్కి పిలిపించి పారిశుద్ధ్య పనులు అప్పగించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడి(ఆర్కే) కార్పొరేషన్ అధికారులకు సూచించారు. నగరంలోని ఎంటీఎంసీ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణపై వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సెక్రటరీలు తమకు కేటాయించిన శానిటేషన్ సిబ్బంది కొంతమందిని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సొంత పనులను వినియోగించుకుంటున్నారని తెలియజేయడంతో ఎమ్మెల్యే ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో జీతాలు తీసుకుంటూ వేరొకచోట ఎలా పనులు చేస్తారని, సొంత పనులు చేయించుకునేవారికి ప్రజాధనాన్ని ఎలా జీతాలుగా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇతర చోట్ల పనిచేస్తున్న వారి వివరాలను సేకరించి వెంటనే వారిని కార్పొరేషన్‌ను పిలిపించి పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం లోపిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. కుక్కల నిర్మూలను యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె.హేమామాలిని, డీసీపీ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఫిరంగిపురం: మండంలోని వరిపంటను పండించే రైతులు భారీ వర్షాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ వాసంతి చెప్పారు. చిగురు తొడిగే దశలో పైరు ఎకరాకు వర్షం తగ్గిన తరువాత 15 కేజీల పొటాష్ 30 కేజీల యూరియా చల్లాలని చెప్పారు. గింజకట్టి ఉన్న దశలో పైరుకు లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్రోపికోనవజోల్ పిచికారీ చేయాలని సూచించారు. మిర్చి రైతులు తమ పొలాల్లో నిలిచిఉన్న నీటిని బయటకు పంపివేయాలని సూచించారు. లీటరు నీటికి మూడు గ్రాముల బైటాక్స్ అనగా కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల వద్ద నుంచి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లో రైతు సంఘం నాయకులతో కలసి వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం పండించిన రైతులు ఆందోళనలో ఉన్నారని, ఆరుగాలం కష్టపడి సేద్యం చేసి, పండించిన వరి ధాన్యం చేతికందే సమయంలో అకాల వర్షాలు కురవడం వలన కల్లాల్లోనే తడిచి, రంగు మారే ప్రమాదం ఉందన్నారు. రైతులు నష్టపోకుండా తక్షణమే ప్రభుత్వ వ్యవసాయ అధికారులు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, పెద్దిశెట్టి వీరాస్వామి, చిర్రావూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్టు

పట్నంబజారు: వివాహిత హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఈనెల 1న సంపత్ నగర్ 6వలైనులో షేక్ హసీనా అలియాస్ బాజి(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ సైదా అలియాస్ అల్లల్లతో వివాహేతర సంబంధం ఉంది. గతకొంతకాలంలో మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందని గుర్తించిన సైదా వారించాడు. ఈవిషయంలో బాజీ, సైదా మధ్య ఘర్షణ జరిగింది. ఈనెల 1న మిర్చి యార్డులో కూలికి వెళ్లిన బాజి సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన భర్త హుస్సేన్ పనికి వెళ్లే దుకాణానికి ఫోన్ చేయడంతో అప్పటికే బాజీ వెళ్లినట్లు వారు తెలిపారు. సైదాతో వివాహేతర సంబంధం ఉన్న విషయం అప్పటికే తెలిసిన హుస్సేన్ సంపత్‌నగర్‌లోని సైదా నివాసానికి వెళ్లాడు. బాజీ మృతిచెంది ఉండటం గమనించాడు. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్న కారణంతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సైదా గొంతునులిమి బాజీని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ముసుగులో నిందితుడు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పట్నంబజారు: తుఫాన్ దృష్ట్యా వర్షం నీరు నిల్వ లేకుండా డ్రెయినేజీ, సైడు కాల్వలు పూడితీత పనులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు 55వ డివిజన్ బొంగరాలబీడులో వర్షం కారణంగా లీకులు ఏర్పడిన అండర్ గ్రౌండ్ డ్రెయిన్, సైడు కాల్వలను పరిశీలించారు. అనంతరం స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు ఉధృతంగా వీస్తున్నాయని, నియోజకవర్గ ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావాలని నూరిఫాతిమా సూచించారు. 24 గంటలూ తాము అందుబాటులో ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అంబేడ్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వినోద్, విజయ్ పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న నూరిఫాతిమా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూ నగర్: మిచాంగ్ తుఫాన్ తీరం దాటినా తీవ్రత ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా నగర పాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీకలవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందని, చుట్టు పక్కల నివాసితులు పిల్లలను బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురాతన భవనాలలో నివసించే వారు వర్షం వలన గోడలు నాని కూలే ప్రమాదం ఉంటుందని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ వలన నగర పరిధిలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 ఫోన్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి తుఫాన్ వల్ల వచ్చే సమస్యల పరిష్కారనికి 4 సీనియర్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే అధికారులు, కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. గాలి తీవ్రత వలన చెట్లు కూలితే పార్క్ సిబ్బంది వెంటనే తొలగించాలని, అందుకు సంబంధిచిన వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వెళితే మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని, రిజర్వాయర్లలో తాగునీటి సరఫరాకి ఏవిధమైన ఆటంకం లేకుండా పర్యవేక్షణ చేయాలని ఏఈలను ఆదేశించారు.

బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన సర్వే చేపట్టాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌ఓబీ/ ఆర్‌యూబీల నిర్మాణాల వలన చుట్టు పక్కన ఎన్ని భవనాలు ప్రభావితం అవుతాయి, నష్ట పరిహారాలు ఎంత అవుతాయో తదితర వివరాలను నగరపాలక సంస్థ నుంచి సర్వే చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో రైల్వే, నగరపాలక సంస్థ అధికారులతో నగరంలోని రైల్వే క్రాసింగ్ పాయింట్స్ వద్ద ఆర్‌యూబీల నిర్మాణంపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శ్యామలా నగర్, నెహ్రూ నగర్, సీతా నగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు ప్రాంతాల్లోని రైల్వే క్రాసింగ్ పాయింట్స్ వద్ద ఆర్‌ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణ ప్రతిపాదనలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, సదరు ప్రాంతాల్లో ఆర్‌ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణం వలన ఎన్ని భవనాలు ప్రభావితం అవుతాయి, వాటికి నష్ట పరిహారాలు ఎంత అవుతుందో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సిటీ ప్లానర్, ఎస్ఈని ఆదేశించారు. నివేదిక మేరకు రైల్వే అధికారులు, జీఎంసీ అధికారులతో సమన్వయంతో తుది నివేదికను రైల్వే బోర్డ్‌కి పంపడం వలన నిర్మాణ అనుమతులు వస్తాయని తెలిపారు. సమావేశంలో రైల్వే డెప్యూటీ సీఈ నోయల్, కన్సల్టెంట్ హనుమరెడ్డి, జీఎంసీ ఎస్ఈ (ఎఫ్ఏసి) సుందరరామి రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.